# బాంధవ్యం



కాశీనాధ
&
కాశీనాధ

ఎలా తెలుస్తుందో తెలియదుకానీ, మాధవరావు యింట్లో కొబ్బరిచెట్లు కాయలు దింపించాలనుకున్న రోజునే వీరయ్య ఊళ్ళోకి వస్తాడు. మాధవరావుకి కనిపించి 'కాయలు దించాలా బాబూ' అంటాడు. మాధవరావుకి ఆశ్చర్యం వేస్తుంది. ఒకటి కాదు, రెండుకాదు నాలుగుసార్లు అలా జరిగింది. ఇవాళ నిద్రలేస్తూనే కిటికీ లోంచి కొబ్బరి చెట్లని చూసి కాయలు దింపించాలనుకున్నాడు. కాయలు దింపించే బాధ్యత ఇంటివాళ్ళు తన మీద పెట్టారు. ఇవాళ వీరయ్య వస్తాడేమో అనుకున్నాడు మాధవరావు. వీరయ్యని ఎక్కడో చూసి నట్లుంది కాని ఎక్కడో గుర్తుకి రాదు.

తొమ్మిదిన్నరయింది. లేచి మొహం కడుక్కుని తల దువ్వుకున్నాడు. తల దువ్వుకుంటూంటే నుదుట పాపిడి దగ్గర మచ్చ కనపడింది. అది చూడగానే లక్ష్మీపురం గుర్తుకు వస్తుంది. వెంటనే గోపాలం, సీతమ్మగారూ గుర్తు వస్తారు. జగన్నాధంగారూ, రుక్మిణీ కూడ గుర్తుకు వస్తారుగాని వాళ్ళతో అంత బాగా పరి చయం లేదు తనకి. అసలు గోపాలంతోటే రెండురోజుల పరిచయం.

రెండురోజులు మాత్రమే పరిచయం వున్న వ్యక్తులు సాధారణంగా రోజూ గుర్తు రారు. కానీ, ఈ తలమీద మచ్చ వాళ్ళని రోజూ గుర్తుకి తెస్తుంది. ఈ దెబ్బ తనకి లక్ష్మీపురంలో తగిలింది. చిన్న చెరువు గట్టుమీద జారి పడ్డాడు. తలకి రాయి తగిలి బాగా రక్తం కారింది. అప్పుడు తనని ఆంబులెన్సులో ఈ ఊరు తీసుకు వచ్చారు. రక్తం బాగా కారడం వల్ల రక్తం ఎక్కించవలసి వచ్చింది. నాలుగు రోజులు ఆస్పత్రిలో వున్నాడు. తనతో ఇక్కడికి గోపాలం కూడ వచ్చి వెళ్ళాడు. వెళ్ళేటప్పుడు తనకి కనిపించలేదు. అంతే ఆ తర్వాత తను లక్ష్మీపురం వెళ్ళలేదు.

లక్ష్మీపురంలో మామయ్యకి, అక్కయ్య, అంటే, తనకు పిన్ని వుంది. వాళ్ళయింటి పక్కనే గోపాలం వాళ్ళ యిల్లు. తను మామయ్యతో వాళ్ళ యింటికి వెళ్ళినపుడు పక్క యింటి గోపాలంతో పరిచయం అయింది.

జుట్టు దువ్వుకుని బయటకు వచ్చేసరికి సిటీబస్సు వస్తోంది. అతను దానికోసం ఆగలేదు. వెళ్ళవలసిన మైలున్నరదూరం నడిచే వెడతాడు.

దారిలో కాఫీహోటలుదగ్గర ఆగాడు. కానీ లోపలికి వెళ్ళలేదు. కాఫీ తాగాలని కోరిక లేకపోలేదు. కానీ ముందుకు నడి చాడు రోజూలాగా. కాఫీతాగే స్తోమత మాధవరావుకు లేకపోలేదు. కానీ అయి దేళ్ళుగా అతను కాఫీ తాగడంలేదు. కాఫీ యిరవై పైసలు. నెలకు ఆరురూపాయలు.

దారిలో పోస్టాఫీసు సందులోకి ఒకసారి నడిచాడు. ఉత్తరాలు వస్తాయనే వెడతాడు. పోస్టాఫీసు యెదురుగావున్న పెంకుటిల్లుని

అప్రయత్నంగానె చూస్తాడు. ఆ యింట్లో ఒక గదిలో వుండేవాడు తను. అద్దె ఎక్కువని యిక్కడికి వచ్చేశాడు. ఆ దారిన వచ్చినప్పుడల్లా పోస్టాఫీసుదగ్గర ఆగుతాడు. ఆ యింటిని చూస్తాడు. చూడాలని కుతూహలం. సాన్నిహిత్యం అది.

పోస్టుమాన్ బయటికి వస్తున్నాడు. 'ఉత్తరాలున్నాయా' అని అడిగాడు. మామూలు ప్రకారం లేవు అనేసి ఆ తర్వాత వెదికాడు. ఒకటివుంది. అతని మరదలు విజయ రాసినది. ఆత్రంగా విప్పి చదివాడు.

'ప్రియమైనవాడికి...' అని వుంది సంబోధన. అలాగే రాస్తుంది. వరసలో పిలవదు. పిస్గ్గ, మరోలా పిలవలేదు. నువ్వు అని ఒకసారి, మీరూ అని వోసారి అంటుంది.

'ఇక్కడికి రావడం మానేసి చాలాకాలం అయింది. నామీద కోపమా? ఎందుకు రావటంలేదు? ఒకసారి వచ్చి చూసిపోవడానికేం?...నాన్న యింకా ఆ సంబంధం గురించి మాట్లాడుతోనే వున్నాడు. అది చేస్తే తన ఎనిమిదివేల రూపాయల అప్పు తీరుతుందని ఆశ...

ఉత్తరం నాలుగైదుసార్లు చదివాడు. విజయ రాసిన వుత్తరాలు ఎప్పుడూ అలాగే చదువుతాడు.

విజయ మాధవరావుకి కావడానికి మరదలే అయినా అంతకన్నా చాల ఎక్కువ. ఆరో ప్రాణం అతనికి. విజయ లేకపోతే తనకి జీవితంలో ఏమీలేదని అతనికి స్పష్టంగా తెలుసు. విజయ సాంగత్యంలో పరాధీనతని సంతోషంగా అంగీకరిస్తాడు.

'ఎందుకు రావడంలేదు?' అంటుంది ప్రతీసారీ. ఇన్నిసార్లు చెప్పదు. ఒక్కసారే చెబుతాడు. ఇంకో రెండునెలల్లో మామయ్య అడిగినది యిచ్చి విజయని దక్కించుకుంటాడు తన అయిదేళ్ల యజ్ఞం అప్పటికి పూర్తి అవుతుంది. మామయ్య ఆర్థిక పరిస్థితిపై తనకి యేమీ బాధ్యత లేకపోయినా, విజయకోసం యే షరతుకైనా అంగీకరిస్తాడు.

వ్యాపారంలో పూర్తిగా చితికిపోయిన మామయ్య, అప్పులు తీరుస్తానని, పెళ్లి ఖర్చులు భరిస్తానని ముందుకువచ్చిన రెండో పెళ్లి రంగనాథానికి కూతుర్ని యివ్వడానికి అంగీకరించారు. విజయద్వారా సంగతి తెలుసుకున్నాడు తను. వెంటనే మామయ్యను కలుసుకున్నాడు.

'చూస్తున్నావుగా మాధవ్ నా పరిస్థితులు. ఈ అప్పులబాధనుంచి తప్పుకోవాలంటే యిదొక్కటే మార్గం' అన్నాడు విచారంగా.

తను చాలసేపు ఆలోచించాడు. ఆదుకుందామంటే తను ఆస్థిపరుడుకాదు తన దగ్గర ఎక్కువ ధనంలేదు. ఉద్యోగమే ఆధారం.

తను ఆలోచిస్తూ వుండిపోయాడు.

ఆతర్వాత విజయద్వారా తనకి తెలిసిన విషయ మేమిటంటే ఆ డబ్బుని కొంత వ్యవధిలో మాధవరావ్ సమకూర్చగలిగిన పక్షంలో తను మరికొంతకాలం ఈ పెళ్లిని వాయిదా వేయడానికి అభ్యంతరంలేదని.

తను ఆనాడే నిశ్చయించుకున్నాడు. తన దగ్గరవున్న డబ్బుకి తోడుగా మరికొంత గడించాలని, నిలవ వేయాలనీ, అది యజ్ఞంలా నిర్వహించాలనీ.

ఆడపిల్లతండ్రి పిల్లనివ్వడానికి షరతు విధించడంలోగల సబబు విషయం ఆలోచించలేదు మాధవరావు. మామయ్య తన పరిస్థితిని వినియోగించుకుంటున్నాడన్న ఆలోచనకూడ రాలేదు మాధవరావుకి. మామయ్య సూచనగాఅడిగిన సొమ్ము పదివేలూ ఎలా కూడబెట్టాలనే ఆలోచనే అతనికెప్పుడూ. విజయతప్ప అతని ఆలోచనల్లోకి యింకేమీరాదు. విజయ అల్లాంటిది. విజయమీద ప్రేమ, విజయ సాన్నిహిత్యం విలువ అల్లాంటివి. విజయ అవసరం అతని కల్లాంటిది.

పోస్టుమాన్ దారిలో కనబడ్డ యింకెవరికో ఉత్తరాలిస్తున్నాడు. ఈ పోస్టుమాన్ అంటే కోపం మాధవరావుకి. తల్లీ, తండ్రీ పెద్ద వాళ్లయాక వాళ్ల మానానవాళ్లని వదిలేసి తనబతుకు చూసుకుంటున్నాడు. రక్త సంబంధం అంత తేలికగా ఎలా వదిలించుకోగలరో అర్థంకాదు అతనికి. తండ్రీ తల్లీ, అన్నలూ, తమ్ముళ్లూ, చెల్లెళ్లూ యిలారక్తం పంచుకు పుట్టినవాళ్లలో భేదాభిప్రాయాలు వచ్చాయన్నా ఒకరినొకరు పరాయివాళ్లుగా చూసినా సహించలేడు మాధవరావు. రక్తసంబంధాన్ని తెంచుకోవడాన్ని ఊహించనైనాలేదు మాధవరావు.

దారిలో వీరయ్య కనబడ్డాడు. అయితే తనని పలుకరించలేదు. అసలు చూడలేదు. మాధవరావే అతన్ని పిలిచాడు. 'సాయంత్రం కాయలు దింపుదుగానిరా' అన్నాడు— వీరయ్య తల వూపి వెళ్లిపోయాడు. వీరయ్యని యెక్కడ చూశాడో యిహా మాటుకూడ గుర్తుకు రాలేదు. ఎప్పుడో హఠాత్తుగా గుర్తుకు వస్తుందిలే అనుకున్నాడు.

ఆఫీసుకి వెళ్లేటప్పటికి పదీ యిరవై అయింది. రిజిస్టరులో సంతకంపెట్టి సీటులో వచ్చి కూర్చున్నాడు. పని చెయ్యబుద్ధికాలేదు

ఆ రోజు యిరవై ఎనిమిదో తారీఖు. ఇంక రెండు రోజులు. జీతం వస్తుంది. వంద రూపాయలు బ్యాంకులో వెయ్యాలి. మిగిలిన దాంతోటే సర్దుకోవాలి. బ్యాంకులో డబ్బు కడుతున్నప్పుడల్లా విజయ తనకి చేరువగా వస్తున్నట్లుంటుంది. ఒక్కొక్క నెల గడచినకొద్దీ, విజయ తన చేతుల లోకి నడచి వస్తున్నట్లుగావుంది. విజయ యింక రెండంగల దూరంలో వుంది.

విజయను తను మొదట చూసినది లక్ష్మీపురంలో, చెరువుగట్టున. నాకు యీత నేర్పవా అంది. నేర్పుతాలే అన్నాడు. నిజానికి తనకి యీత రాదు. గోపాలానికి బాగావచ్చు. కావాలని గోపాలంతో పరిచయం చేసుకున్నాడు యీత నేర్చుకోవడంకోసం.

గోపాలం తల్లి సీతమ్మగారు. తండ్రి జగన్నాథంగారు. చెల్లెలు రుక్మిణి. పెద్ద యిల్లు వాళ్లది. అయినా బాగా పాతది. చాలకాలం అయింది కట్టించి. పెద్ద పెరడు వుంది. దానినిండా రకరకాల మొక్కలు. రాధా మనోహరాలు, మూరు వరహాల మొక్కలు. ఒక పక్కన. పక్కనే నంది వర్థనం చెట్టు. సన్నజాజి తీగ పందిరిమీద పాకుతూండేది. పువ్వులు అలా చూస్తూ వుండాలనిపించేది. గన్నేరు పువ్వులుకూడ చాల ముచ్చటగా వుండేవి. ఆయనా చాల శ్రద్ధగా తోటపని చేసేవాడు. పెరట్లో ఏ భాగమూ వృధాగా పోనిచ్చేవాడుకాదు. పూలమొక్కలో, కూరమొక్కలో వేసేవాడు. రోజూ పొద్దున్న అన్ని మొక్కలకీ నీళ్లు పోసేవాడు. సాయంత్రంవచ్చి అన్ని మొక్కలనీ పరీక్షించేవాడు. చీడవుంటే తీసేసేవాడు. దొంగళీ పురుగులనీ పుల్లతో లాగేసే

గాడు. ఆయన పద్ధతి కొంచెం విచిత్రంగా వుండేది. ఆ యింట్లో ఏ భాగం చెడిపోయినా బాగు చెయ్యనిచ్చేవాడుకాడు. పాత భాగాలనే మళ్ళీ సరిగ్గా పెట్టమనేవాడు. కొత్త అనేది ఒప్పుకొనేవాడుకాడు. తను చిన్నప్పటినుంచీ తిరిగిన యిల్లు అలాగే వుండాలనేవాడు. సీతమ్మగారూ అలాగే అనేది. వాళ్ళది మేనరికం. ఇద్దరూ పుట్టినప్పటినుంచి ఆ యింట్లోనే వున్నారు.

ఆ యింటి గోడ దగ్గర నిలబడితే చెఱువు, చెఱువు గట్టు, చెఱువుగట్టు స్పష్టంగా కన్పిస్తాయి.

జగన్నాధంగారు వ్యాపారం చేసేవారు. బాగానే నడిచేది.

ఈ పాటికి గోపాలం, రుక్మిణీకూడ పెద్దవాళ్ళయి వుంటారు. రుక్మిణికి పెళ్ళీడు వచ్చి వుంటుంది.

సాయంత్రం కాగానే యింటికి బయలుదేరాడు. వీరయ్య అప్పటికే వచ్చాడు. 'కొయ్యమంటారా బాబూ' అన్నాడు వీరయ్య. కానిమ్మన్నాడు మాధవరావు.

వీరయ్య కాళ్ళకి తాళ్ళు కట్టుకుంటూంటే 'నిన్నెక్కడ చూశానో గుర్తుకు రావడం లేదోయ్!' అన్నాడు.

'అన్ని ఊళ్ళూ తిరుగుతుంటాను. ఎక్కడైనా చూసి వుంటారు' అన్నాడు వీరయ్య.

వీరయ్య చకాచకా ఎక్కుతూంటే మాధవరావు గుండెలుగ్గబట్టుకుని

# బాంధవ్యం

చూశాడు. తనకి తెలియకుండానే 'జాగ్రత్త' అన్నాడు. పడిపోతాడేమోనని భయం మాధవరావుకి. అక్కడ మంచి పడితే రూపం కూడ మిగలదు.

వీరయ్య పైకి ఎక్కి లేత కాయలు వుంచేసి ముదురువన్నీ కోసి కిందికి వేశాడు. ఒకటి రెండు పక్కింట్లో పడిపోవడం, వాళ్ళు గుట్టు చప్పుడు కాకుండా లోపల పెట్టుకోవడం చూశాడు మాధవరావు.

వీరయ్య దిగి వచ్చాక ఇంటి వాళ్ల తరఫున డబ్బు యిచ్చాడు.

'వీరయ్యా, ఎందుకంత తొందరగా ఎక్కుతావు? కాస్త జాగ్రత్తగా ఎక్కరాదూ' అన్నాడు యింకోసారికి జాగ్రత్త చెబుతూ.

'ఏముంది బాబూ! అలవాటే. క్షణాల్లో యెక్కుతాను. సావే వస్తే ఆపగలమా బాబూ...!...అయినా, ఎప్పుడో యీ కొబ్బరి చెట్లమీదే చచ్చిపోతాను బాబూ' అన్నాడు వీరయ్య.

'ఛ ఛ' అన్నాడు మాధవరావు. అంటూంటేనే అతని మొహం వెలిగింది.

'ఇప్పుడు గుర్తుకు వచ్చింది. నిన్ను చూసింది లక్ష్మీపురంలో ... అవునా?' అన్నాడు వుత్సాహంగా.

వీరయ్యకి గుర్తు రాలేదు.

మాధవరావు జ్ఞాపకం చేశాడు. 'చిన్న చెఱువు ... ఈతలు కొట్టాం నేనూ, ఇంకో కుర్రాడూ...ఆ రెండో అతను రోజూ వచ్చేవాడు...పేరు గోపాలం'.

వీరయ్య పెద్దవాడు. జ్ఞాపక శక్తి తగ్గింది. జ్ఞాపకం వస్తున్నట్లుగా తల ఆడించాడు.

'గోపాలం ఎప్పుడూ చిన్న చెరువు దగ్గరే వుండేవాడు. నువ్వు చెరువు దగ్గర కొబ్బరికాయలు కోస్తుంటే చెరువులో పడిపోయినవి దూకి తీస్తూండేవాడు. పంతం పట్టి సరిగ్గా కొబ్బరికాయ మీదకే దూకేవాడు. ఎప్పుడో ఈతలోనే చచ్చిపోతానన్నాడా రోజు... 'తప్పు బాబూ అలా అనకూడదు' అన్నావునువ్వు' అన్నాడు మాధవరావు.

వీరయ్య తల వూపాడు. అంతలోనే మొహంలో విషాదం కనిపించింది. 'కాని బాబూ ... ఆ ఈతలోనే పోయాడు ఆ బాబు' అన్నాడు.


'గోపాలం పోయాడా? ఏం జరిగింది.'

'మామూలుగానే ఈతలు కొడుతున్నాడు బాబూ. ఒకసారి ఎత్తు గట్టుమీదనుండి దూకాడు. అంతే మళ్ళీ తేలలేదుట. అక్కడ అట్టే లోతులేదని, అడుగున బురదవుందనీ అనుకున్నారు...'

మాధవరావు గుండె పట్టుకున్నాడు. గోపాలం కళ్ళముందు మెదిలాడు. వాళ్ళ నాన్నగారికి ఆశాజ్యోతి అతను. ఆయన బాధ్యతలన్నీ ఈపాటికి కొడుక్కి అప్పగించి విశ్రాంతి తీసుకుంటూ వుంటాడు' అని యిన్నాళ్ళు వూహించుకున్నాడు మాధవరావు.

గోపాలం తనకన్న అయిదేళ్ళు పెద్ద. తను అతన్ని ఎక్కువగా చూడకపోయినా గుర్తున్నాడు. అతనికి ఈత బాగావచ్చు. రకరకాల ఈతలు కొట్టాడు. బారు ఈత ఈదాడు. వెల్లకిలా పడుకుని నీటిమీద తేలాడు. ఒకచోట మునిగి ఇంకోచోట తేలాడు. నీటిలో పిల్లిమొగ్గ వేశాడు.

'కూతురు రుక్మిణమ్మగారి పెళ్ళి అయ్యాక ఆ యిల్లు బాగా చితికిపోయింది బాబూ. జగన్నాధంగారికి వ్యాపారంలో బాగా నష్టం వచ్చింది. ఆయన తట్టుకోలేక పోయారు. మనిషి శీలా అయిపోయారు. అప్పుడే గోపాలం చదువు మానేసి వుద్యోగంలో చేరాడు. నాన్నగారి అప్పులన్నీ తీరుస్తున్నాడు బాబూ. రాత్రీ పగలు



పనిచేశాడు. ఎనిమిదివేలు అప్పులున్నాయట బాబూ ఇంకా ... అంతట్లోనే యిలా ముంచుకు వచ్చింది...'

వీరయ్య కళ్ళు తుడుచుకున్నాడు.

నేను వాళ్ళింట్లో యిదివరకు పని చేశాను బాబూ. సీతమ్మగారినీ, జగన్నాథం గారినీ నేనే ఎత్తుకొనేవాడిని. వాళ్ళు బంతి ఆడుకుంటూంటే పక్కకి పోయి నప్పుడు తెచ్చిచ్చేవాడిని. చెరువుగట్టుకి షికారు తీసుకెళ్ళేవాడిని. అప్పుడు ఒకే బస్సు వుండేది. బస్సులో ఎంతమంది ఎక్కుతున్నారో ఎంతమంది దిగుతున్నారో లెక్కపెట్టేవాడు.'

వాళ్ళు ఆ యింట్లో ఒక వేపచెట్టుని పెంచేవారు బాబూ. అది యిప్పటికీ వుంది. దానికి రోజూ పంతాలు వడినీళ్ళు పోసేవారు. రోజూ చుట్టూ మట్టితీసేవారు. నిచ్చెన ఎక్కి రాధా మనోహరం పువ్వులుకోసి యిచ్చేవారు జగన్నాథం బాబు.

ఆ యిల్లంటే వారికి ప్రాణం.

ఆయింటి ముందుగదిలోనే వాళ్ళపెళ్ళి జరిగింది. అక్కడే గోపాలం బాబూ రుక్మిణమ్మా పుట్టారు. అక్కడే రుక్మిణమ్మకి పెళ్ళయింది. అక్కడే చచ్చిపోవాలనే వారు ఆయన...'

మాధవరావు బాధగా చూశాడు.

'కానీ బాబూ మొన్ననే ఆయిల్లు వేలం వేశారు. జానకి రామయ్యగారు అని ఎవరో ఎనిమిదివేలకి కొనుక్కున్నారట బాబూ!

మాధవరావు యింక వినలేదు. కాసేపు మాట్లాడలేక పోయాడు. జగన్నాథంగారూ సీతమ్మగారూవున్న పరిస్థితిని తలచుకుంటు న్నాడు.

'కొడుకులేడు. కూతురు పెళ్ళయి వెళ్ళిపోయింది. ఏదో బీదసంబంధం చేశారు. ఆదుకునే రక్తసంబంధీకులు ఎవరూలేరు. పాపం ఆ యమ్మకీ, బాబుకీ రావలసిన కష్టాలుకావు...' అన్నాడు వీరయ్య.

రెండు నిమిషాలకి తేరుకున్నాడు మాధవరావు బాధపడి ప్రయోజనంలేదు. అందరికీ ఏదోరకమైన కష్టాలుంటాయి. అన్నీ విని బాధపడితే దీనికి అంతువుండదు.

తనకీ కష్టాలూ, సుఖాలూ, బాధలూ, ఆశలూ, నిరాశలూ అన్నీ వున్నాయి. తనకీ జీవితంవుంది. తనూ అయిదేళ్ళు కష్టాలు


డాక్టర్ వాసూస్ సుగంధ షీకాయ్

(100 గ్రాములు 35 పైసలు)

మంచి రకం మైసూరు షీకాయిలో మెంతులు, బావంచాలు, వట్టివేళ్ళు, చందనం మొదలైన సుగంధ ద్రవ్యములు కలిపి తయారుచేయబడినది. తలకు, కళ్ళకు చలువచేస్తుంది. జుట్టును మెత్తబరుస్తుంది. వెంట్రుకల కుదుళ్ళు నుత్తేజపరచి పెరుగుటకు సహకరిస్తుంది.

Dr. VASU PRODUCTS. HYDERABAD—27.



సపట్ మలామ్



తామర, గజ్జి, విడుము.
పాదములమీద మరియు వేళ్ల మధ్య పగుళ్లను పోగొట్టుటకు దివ్యమైనది.

SAPAT & CO., BOMBAY 2.

ఏజంట్లు: ది ట్రేడ ప్రమోటింగ్ కార్పొరేషన్
బకింగ్‌హాం పేట, విజయవాడ—2.





ముత్యాలవంటి

తెల్లని పలువరస...
సులభమైన డెంటానిక్ పద్ధతి ద్వారా మీరు అందమైన తెల్లనిదంతములను, ఆరోగ్యకరమైన చిగుళ్ళను పొందగలరు.

సాదా, మరియు క్లోరోఫిల్ తోలభించును.

బెంగాల్ కెమికల్స్
డెంటానిక్
అంటిసెప్టిక్ టూత్ పౌడర్
కలకత్తా * బొంబాయి * కాన్పూర్ * ఢిల్లీ



# బాంధవ్యం

పెద్దాడు. జీవ్వా చంపుకున్నాడు. మనసు చంపుకున్నాడు. కోరికలు సరదాలు వదిలేడాడు. ఆబాధలు చాలు. తను పోగొట్టుకున్న సుఖాలు చాలున్నాయి. అనిర్వచనీయమైన ఆనందంకోసం, — విజయ సాన్నిధ్యంకోసం—తను ఇదంతా చేశాడు. ఇప్పుడు ఫలం చేతిలోకివస్తోంది. ఇది సంతోషించవలసిన సమయం. కష్టాలు అన్నీ మరచిపోయి సుఖపడవలసిన సమయం. ఎక్కడ ఆనందంవుంటే అక్కడ చూడాలి. తన సుఖం ఎక్కడవుంటే అక్కడికి పోవాలి. విజయ కావాలనుకున్న మనసు విజయని పొందాలి. జగన్నాథంగారికి, సీతమ్మగారికి కష్టాలుంటే దానినిగురించి పట్టించుకోవలసినదీ, బాధ్యత వహించవలసినదీ వాళ్ళ రక్త సంబంధీకులూ, రక్తం పంచుకున్న వాళ్ళూ, తనుకాదు.

మాధవరావు మనస్సు తేలిక పడింది. జగన్నాథంగారూ, సీతమ్మగారూ మనసు లోంచి వెళ్ళిపోయారు. విజయ దివ్య మోహనరూపం కనిపించింది. విజయ తన చేతుల్లోకి వస్తున్నట్లుంది. నవ్వుతోంది.

'ఒకసారి విజయనిచూస్తే' అనిపించింది. నిజానికి యింకొక్క నెల ఆగాలి. తన విజయ తను అనుకున్న పద్ధతిలో తన దగ్గరకు రావడానికి. కానీ ఆగాలనిలేదు.

విజయ ఎక్కడుందో తెలియదు. వాళ్ళ వూళ్ళో అయినా వుంటుంది. లేదా లక్ష్మి పురంలో అయినా వుంటుంది. లక్ష్మి పురంలో అత్తయ్య యింటికి సామాన్యంగా వెడుతూనే వుంటుంది విజయ. మామయ్య కూడా తరచు వెడుతూనే వుంటాడు. ఇద్దర్లో ఒకరుగాని, ఇద్దరూగాని అక్కడ వుండొచ్చు.

మాధవరావు లక్ష్మిపురం బయలుదేరాడు. వీరయ్యకూడా వచ్చాడు. అక్కడ కొబ్బరికాయలు దించవచ్చునని బయలుదేరాడు వీరయ్య. అక్కడ పిన్ని వుంది. మామయ్యకూడ అక్కడే వున్నాడు. కాని విజయలేదు.

అంటే మామయ్యతోపాటు వాళ్ళ వూరికి విజయని చూడటానికి వెళ్ళాలి.

మామయ్యని అడుగుదామనుకొన్న విషయం అడగలేదు మాధవరావు. విజయ నిమ్మని ధైర్యంగా అడుగుతాడు. తన వ్రతం దాదాపు పూర్తయింది. కాని యిల్లా కాదు. విజయ సాన్నిధ్యంలోనే అడుగుదామనుకున్నాడు. మామయ్యకి కూడ మాధవరావు ప్రయత్నం తెలుసు. ఆయనంతట ఆ ప్రస్తావన ఆయన తీసుకురాలేదు. వూరుకి వెళ్ళాక ఆ విషయం మాధవరావే ప్రస్తావిస్తాడని ఊరుకున్నాడు.

మాధవరావు లక్ష్మిపురంలో ఒక రోజు వున్నాడు. జగన్నాథంగారూ, సీతమ్మగారూ కనిపించారు. సీతమ్మగారు బాగా చిక్కిపోయింది. ఆయన కూడ బాగా నీరసంగా వున్నారు. కళ్ళు లోతుకు పోయాయి. చిట్టచివరి ఆశ కళ్ళముందునుంచి కదలిపోతుంటే మనిషి ఎలా వుంటాడో అలాగే వున్నాడు. ఆ యిల్లు ఒకటి రెండు రోజులలో ఖాళీ చేయాలట. ఆ యిల్లు వాళ్ళ కలాంటిది

వీరయ్యకి అక్కడ పని పూర్తయింది. తన యింట్లో కట్టెలు కొట్టడంలాంటి పనులున్నాయని, తనతో తీసుకు వస్తానని అన్నాడు మాధవరావు మామయ్య. ముగ్గురు లక్ష్మిపురంనుంచి బయలుదేరారు.

చెరువుగట్టునవున్న బస్సు స్టాండుకి బయలుదేరారు. బస్సు వచ్చివుంది. ముగ్గురూ ఎక్కారు. ఏమీ మాట్లాడక పోతే తోచటంలేదు మాధవరావుకి!

'మామయ్యా వీరయ్యని చూసినప్పుడల్లా ఎక్కడో చూసినట్లుంటుందని అనిపించేది. తర్వాత గుర్తుకు వచ్చింది. వేణూ, గోపాలం చెరువులో స్నానం చేస్తుంటే చెరువుగట్టున కొబ్బరికాయలు దించాడు!'

మామయ్య ఒద్దు వచ్చాడు 'అవునూ ...గోపాలం చచ్చి పోయాట్ట తెలుసా'

'ఆ, తెలుసు' అన్నాడు మాధవరావు విషాదంగా.

'పాపం మంచివాడు. నీకు దెబ్బతగిలి నప్పుడు రక్తం కూడ యిచ్చాడు.'

మాధవరావు చటుక్కున తలెత్తి చూశాడు. 'నిజమా!' అన్నాడు.

'అవును. అంబులెన్సులో మీ ఊరు తీసుకెళ్ళినప్పుడు తనూ వచ్చాడు. అతని రక్తం నీకు ఎక్కించారు.'

మాధవరావు ఒక్క క్షణం ఆలోచిస్తూ వుండిపోయాడు. ఏదో నిశ్చయం అతని ముఖంలోకి కనిపించింది.

ఉన్నట్లుండి 'ఇప్పుడే వస్తా' అంటూ దిగి వెళ్ళిపోయాడు.

'ఎక్కడికీ బస్సు కదలబోతుంటే?'

'ఫరవాలేదు. వెంటనే వచ్చేస్తా. వీరయ్యా నువ్వు కూడా రా' అంటూ కిందికి దిగాడు.

అయిదు నిమిషాలయింది. కండక్టరు వచ్చి టిక్కెట్లు ఇచ్చాడు. డ్రైవరు కూడ వచ్చి కూర్చున్నాడు.

వీరయ్య ఒక్కడే తిరిగి వచ్చాడు 'ఈ చీటి ఇమ్మన్నారు బాబూ' అన్నాడు...

'క్షమించండి. నేను మీతో రావడం లేదు. జగన్నాథంగారి ఇల్లు జానకిరామయ్య గారి దగ్గర్నించి కొనదలచుకున్నాను. జగన్నాథంగారూ, సీతమ్మగారూ కోరుకొన్నది జరగాలి. ఆ బాధ్యత నా కుంది—

మాధవరావు.

అని వుంది. చెరువు గట్టు బస్సు స్టాండులో బస్సు కదిలింది. ●

